
# కేటలినా అయిలాండ్ ట్రావెలాగ్




## – మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

**లాంగ్ బీచ్‌లోని** గోల్డెన్ షోర్ నించి లాస్ ఏంజెలెస్ ఎయిర్‌పోర్ట్ సమీపంలోని హోటల్ లా క్వింటాకి 40 నిమిషాల్లో రాత్రి 7.10కి చేరుకున్నాం. ఊబర్ టేక్సీకి 28 డాలర్ల 22 సెంట్లు అయింది. లిపి ఆన్‌లైన్ చెకిన్ చేయడంతో ఆలస్యం లేకుండా కీస్ తీసుకుని మా గదికి వెళ్ళాం. రూం నంబర్ 829. ఎనిమిదో ఫ్లోర్ లోని 29 వ గది. దారిలోంచి ఫోన్ చేసి లే అవుట్‌ని చూసి లిపి గదిని ఎంపిక చేసింది. రెండు క్వీన్ బెడ్స్, టివి, మైక్రోవేవ్ ఓవెన్, ఫ్రిజ్జ్, ఏసి, ఫోన్, వైఫైలు ఉన్నాయి. బెడ్ మీది కార్డ్ మీద ఇలా అచ్చయి ఉంది. *‘రెడీ ఫర్ యు. ఐ యేవ్ పర్సనల్లీ క్లీన్డ్ అండ్ ప్రిపేర్డ్ దిస్ రూం ఫర్ యు ఫ్రం టాప్ టు బాటమ్. ఐ హోప్ యు ఎంజాయ్ యువర్ స్టే వితజ్. - మార్తా. టి సంతకం.*‘

ఒకవేళ ఏదైనా లోపం కనిపిస్తే ఈ అమ్మాయి పేరు మీద ఫిర్యాదు చేయాలని అది మర్యాదగా చెప్పిన విషయమని నాకు అనిపించింది. కొన్ని హోటల్స్‌లో బస చేసినవారు ఎయిర్ పోర్ట్ షటిల్స్‌లో ఉచితంగా ఎయిర్‌పోర్ట్‌కి వెళ్ళచ్చు. మా ఫ్లైట్ ఎక్కడానికి ఆ హోటల్‌నించి మర్నాడు ఉదయం ఎన్ని గంటలకి బయలుదేరాలో లిపి రిసెప్షనిస్ట్‌ని అడిగి తెలుసుకుంది.

రిఫ్రెష్ అయ్యాక ఊబర్లో యూనివర్శల్ స్టూడియోకి 45 నిమిషాల్లో రాత్రి తొమ్మిదికి చేరుకున్నాం. ఈ డాలర్ల 48 సెంట్లు అయింది. హాలీవుడ్‌లోని యూనివర్సల్ స్టూడియోకి రావడం మా ఇద్దరికీ ఇది రెండోసారి. మొదటిసారి 1990లో మా మొదటి యుఎస్ ట్రిప్‌లో దీన్ని చూసాం. హాలోవీన్ డే కాబట్టి హాలోవీన్ హారర్ నైట్స్ అనే ప్రత్యేక ప్రోగ్రాం ఉంది. ఆ రోజు యూనివర్సల్ స్టూడియో టిక్కెట్‌కి ప్రత్యేక ప్రోగ్రాం ఉంది. ఆ రోజు





యూనివర్సల్ స్టూడియో టిక్కెట్‌కి ప్రత్యేక ధర, యూనివర్సల్ స్టూడియోలో పనిచేసే లిపి ఫ్రెండ్ ఎంప్లాయి డిస్కౌంట్‌తో 199 డాలర్లకే టికెట్ వచ్చింది. లేదా మనిషికి 250 డాలర్లు. ఎంట్రన్స్ టిక్కెట్ స్కేన్ చేసి, స్కేనర్ కింద నించి నడిచి లోపలికి వెళ్ళాం. ఆ రోజు ప్రత్యేకంగా కొన్ని ఈవెంట్స్ నిర్వహించారు. చాలాచోట్ల రకరకాల దయ్యాల మేకప్‌లు వేసుకున్న ఎంటర్‌టైనర్స్ కనిపించారు. బాగా రద్దీగా ఉంది. అన్ని దేశాల పర్యాటకులు కనిపించారు. యూనివర్సల్ స్టూడియోస్ అని రాసిన దాని లోగో ఐన గ్లోబ్ ఎంట్రన్స్‌లోనే తిరుగుతోంది. లోపల రోడ్‌కి అటు, ఇటు

ఉన్న షాప్స్ రంగురంగుల లైట్లతో దేదీప్యమానంగా వెలిగిపోతున్నాయి. ఎడమవైపు సిటీవాక్. కుడివైపు నడిచాం. మెంబీస్ ఫ్రూట్ యోగర్ట్ షాప్, మార్గరీటావిల్ అనే బార్, ది రైడర్ ఇమేజ్, ఫ్యూరియస్ జార్జ్ పార్కింగ్ వెడ్జెస్ ఇలా అనేక షాపులు కనిపించాయి. ఓ చోట ఎర్ర సూట్లోని ఒకరు గాలిలో పైకి, కిందకీ తేలుతున్నారు. మరికొంచెం ముందుకి వెళ్ళి మంటలు పైకి వచ్చే రోడ్ మీది ఆర్చ్‌ని దాటాం. ఓ షాప్‌లో నాన్ ఆల్కహాలిక్‌లో బాటిల్డ్ వాటర్, సోడా (కూల్ డ్రింక్స్) కాఫీ, హాట్ కోకో, ఏపిల్, ఆరెంజ్, క్రేన్‌బెర్రీ, పైనాపిల్ జ్యూసులు, వివిధరకాల హాట్ టీస్ అమ్ముతున్నారు.

హాలీవుడ్ హారర్ సినిమాల పేర్లతో నిర్మించిన అక్కడున్న హాంటెడ్ హౌసెస్ అన్నీ చాలా రద్దీగా ఉన్నాయి. లిపి ఒక్కొక్కదానికి వెళ్దామని చెప్పడంతో రద్దీని బట్టి వాటిలోకి వెళ్ళాం. లోపల చీకటి గదుల్లో, సొరంగాల్లో వెళ్తూంటే స్పీకర్లలో భయంకర శబ్దాలు, భయపడే సందర్శకుల అరుపులు వినపడుతున్నాయి. దయ్యాల భయంకర రూపాల్లోని నటీనటులు చేతిలో రక్తం కారే కత్తులులాంటి ఆయుధాలతో మన సమీపానికి వచ్చి చంపబోతున్నట్లుగా నటించి వెనక్కి వెళ్తున్నారు.







రద్దీవల్ల మేం వెళ్ళలేదు కానీ పెద్ద మేజ్‌ని తాత్కాలిక టెంట్‌లో కాక, స్టూడియోలోని సౌండ్ స్టేజ్ (ఫ్లోర్)లో నిర్మించారు. ఇది చాలా పెద్ద మేజ్. అందులో కూడా గోడల మీద భయంకర సినిమాల సీన్స్‌ని ప్రొజెక్ట్ చేస్తూంటారు. మేము పోలార్ గీస్ట్ అనే భయంకరమైన మేజ్‌లోకి వెళ్ళాం. మేము బాగా ఎంజాయ్ చేసిన టూర్ బేక్‌లాట్‌లోని టెర్రర్ ట్రామ్. స్పీల్‌బర్గ్ తీసిన వార్ ఆఫ్ ది వరల్డ్స్‌లోని ఏరో ప్లేన్ క్రాషైన ప్రదేశం, సైకోలోని బేట్స్ మోటెల్, రకరకాల చిన్న, పెద్ద హారర్ సొరంగాల్లోంచి ఆ ట్రాం ప్రయాణించింది. యూనివర్సల్ సినిమాల్లోని వివిధ రకాల మాన్‌స్టర్ పాత్రల మేకప్‌తో యూనివర్సల్ మాన్‌స్టర్స్ భయంకర శబ్దాలతో దర్శనం ఇచ్చారు.



మేమెక్కిన మోనో రైలు చీకట్లో సొరంగంలోని వెళ్తూంటే అటూ, ఇటు రక్తం ఓడే మనుషులు చేతులు, కాళ్ళు లాంటి అవయవాలు కనిపించాయి. పొగ, లైట్స్, ప్రాప్స్ (సెట్టింగ్స్) మేకప్ చేసుకున్న ఆర్టిస్ట్‌లతో బేక్ లాట్‌లోని ఇళ్ళన్నీ సందర్శకులని భయపెట్టేలా ఉన్నాయి. దూరంగా గాల్లోకి మంటలు లేచే ఎక్స్‌ప్లోజిషన్స్ కనిపించాయి. చెయిన్ సా (చెట్లని కూల్చే మర రంపం) కత్తులు పట్టుకున్న నటీనటులు నడిచే సందర్శకుల మీదకి అకస్మాత్తుగా వచ్చి భయపెట్టి మళ్ళీ వెనక్కి వెళ్ళిపోసాగారు. ఆ రాత్రి యూనివర్సల్ స్టూడియోలోని హెల్స్ హార్వెస్ట్, ట్రిక్ ఆర్ ట్రీట్, చెయిన్ సా ఛేజవుట్, స్ట్రేంజర్ థింగ్స్, పోలార్‌గీస్ట్‌లని చూసాం.

ఈ స్కేర్ జోన్స్ మా ముగ్గురిలో ఎవర్నీ భయపెట్టలేదు. ఇలాంటివి ఎంజాయ్ చేయడానికి కొంత అమాయకత్వం అవసరం. వాళ్ళు నటీనటులే, మనకేం కాదు అన్న జ్ఞానం వాటిని సరిగ్గా ఎంజాయ్ చేయడానికి అడ్డుపడింది. అలసిపోయిన పద్మజ ఓ బెంచ్ మీద కూర్చుంటే లిపి క్రిస్టీ

బర్గర్స్ రెస్టారెంట్‌లో వీగన్ అండ్ వెజ్ బర్గర్స్‌ని, మదర్ నేచర్ బర్గర్ ప్లాటర్‌ని కొన్నది. పద్మజ వాటితో వచ్చిన ఫ్రైస్‌ని మాత్రం తిన్నది. పద్మజకి పాప్‌కార్న్, ఐస్‌క్రీమ్‌లని కొన్నాం.

***నవంబర్ 1 2018***

తెల్లారుఝామున రెండున్నర దాకా మొత్తం తిరిగి చూసాక, ఇక నిద్రమత్తుతో, అలసటతో రూమ్‌కి వెళ్ళిపోదామనుకున్నాం. బయటకి దారి తెలుసుకుని వచ్చిన దారిలోకాక, ఎగ్జిట్ గేట్లోంచి రోడ్ మీదున్న కాలి వంతెన మీద నడిచి రోడ్ అవతలి పేవ్‌మెంట్ మీదకి మెట్లు దిగి చేరుకున్నాం. అక్కడున్న యూనివర్సల్ స్టూడియో ఉద్యోగి సందర్శకుల్లో టేక్సీలో వెళ్ళేవారికి ఎక్కడ నించోవాలో చెప్తున్నాడు బుక్ చేసిన ఐదు నిమిషాల్లో ఊబర్ టేక్సీ వచ్చింది. లా క్వింటాకి వెళ్తూంటే రోడ్లన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి. మూడుం పావుకి హోటల్‌కి చేరుకున్నాం. ఊబర్‌కి 45 డాలర్ల 41 సెంట్లు అయింది. ట్రాఫిక్ అయింది. ట్రాఫిక్ తక్కువగా ఉండటం వల్ల తిరిగి వెళ్ళేప్పుడు 15 నిమిషాల్లో చేరుకున్నాం.

గంటన్నర పడుకుని అలారం మోగగానే లేచి స్నానాలు చేసి, రూం వెకేట్ చేసి ఎయిర్‌పోర్ట్ షటిల్ ఎక్కాం. అందులో నలుగురైదుగురు మించి లేరు. మధ్యలో మరో హోటల్ బయట ఆగి ప్రయాణీకులని ఎక్కించుకుని, షటిల్ సరాసరి లాస్‌ఏంజెలెస్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కి చేరుకుంది. ఎయిర్‌పోర్ట్‌లో అన్ని ఫార్మాలిటీస్ ముగించుకుని స్పిరిట్ ఎయిర్ లైన్స్ విమానం డిపార్చర్ గేట్ నంబర్ 54బి కి చేరుకున్నాం. ఆకలిగా ఉండటంతో లిపి స్టార్ బక్స్‌లో తలో పానిని టమోటా అండ్ మొజరెల్లా సేండ్ విచ్‌ని కొన్నది. మా ఫ్లైట్ నంబర్ ఎన్.కె 949. సీట్ నంబర్లు 25 ఇ, ఎఫ్.జి. బోర్డింగ్ టైం 6.45. డిపార్చర్.

డిపార్చర్ 7.30. 8.15కి ఓక్ లేండ్ ఎయిర్‌పోర్ట్‌లో మా విమానం లేండైంది.

ఓక్‌లాండ్ ఎయిర్ పోర్ట్ నించి కిరణ్‌ప్రభగారింటికి ఊబర్ టేక్సీలో చేరుకోవడంతో మా కేటలీనా యాత్ర ముగిసింది. వారింటికి 35 నిమిషాల ప్రయాణం. 36 డాలర్లు.




***లాకీ, కేలిఫోర్నియా***

28 అక్టోబర్ 2018 ఆదివారం రోజు కిరణ్‌ప్రభగారు మమ్మల్ని వారుండే డబ్లిన్‌కి షుమారు 70 మైళ్ళ దూరంలోని లాకీ అనే ఓ పురాతన చైనీస్ గ్రామానికి తీసుకువెళ్ళారు. కారులో గంటన్నర ప్రయాణం. రోడ్ మీంచే వెల్ కం టు లాకి, ఎస్టాబ్లిష్ట్ 1915 అనే బోర్డ్ స్వాగతం పలుకుతోంది.

బయటి రోడ్ మీంచి మా కారు కుడివైపు లివీ స్ట్రీట్‌లోకి మళ్ళీ గ్రామం మెయిన్ రోడ్‌లోకి తిరిగింది. ఆ రోడ్‌కి అటు, ఇటు ఉన్న ఇళ్ళ



ముందున్న పాత్‌వేలో నడిచి కుడివైపున్న లాకీ మెమోరియల్ పార్క్‌కి వెళ్ళాం. అక్కడ ఎంట్రన్స్‌లో గ్రనైట్‌తో చేసిన సింహం శిల్పం ముందు ఒన్ సెంట్ కాపర్ నాణాలు చాలా కనిపించాయి. గుడ్‌లక్ కోసం చైనీస్ వీటిని వేస్తూంటారు. విమానం ఎక్కే చైనీస్ దాని ప్రొపెల్లర్లలోకి ఇలా గుడ్ లక్ నాణాలు విసరడంతో కొన్నిటికి ప్రమాదం

జరిగాయని నేను స్వాతి వీక్లీలో రాసే ఎయిర్‌పోర్ట్ టు ఎయిర్‌పోర్ట్ అనే కాలం కోసం చదివిన ఓ వెబ్‌సైట్లో కనిపించింది. పార్క్‌లో ఎదురుగా ఓ పొడవైన లోహపు మాన్యుమెంట్ కనిపించింది. రైలు పట్టాలు వేసే, తోటల్లో పనిచేసే కూలీల దృశ్యాలు ఆ స్మృతి చిహ్నం మీద చెక్కిఉన్నాయి. పార్క్‌లోపల బెంచీలు, చెట్లు విగ్రహాలు ఉన్నాయి. 2011లో ఝొంగ్‌షాన్ అనే చైనీస్ నగర మునిసిపాలిటీ బహూకరించిన, ఆధునిక చైనీస్ పితామహుడు డాక్టర్ సన్ ఎట్ సేన్, కన్‌ఫ్యూషియస్ విగ్రహాలు వారు బస చేసిన ఇంటి బయట ఉన్నాయి. డాయ్ లాయ్ మ్యూజియం మూసేసి ఉండటంతో చూడలేకపోయాం. కిటికీలోంచి చూస్తే ఆనాటి వారు ధరించిన దుస్తులు, ఫోటోలు కనిపించాయి.

లాకీ చరిత్ర: కేలిఫోర్నియాలో శాక్రిమెంట్‌లోని వ్యాపారస్థుడు జార్జ్ డబ్ల్యు లాకీ శాక్రిమెంటో సిటీ ఎదుగుదలకి సహాయం చేసాడు. లాకీకి ఆ నగరంలోనే కాక, ఐలండ్ డిస్ట్రిక్ట్‌లో కూడా భూములున్నాయి. ఆయన ఆగస్ట్ 1909లో 9నెలల అనారోగ్యం తర్వాత 79వ ఏట మరణించాడు. 1915లో వాల్‌నట్ గ్రోవ్ అనే చోట చైనీస్ వలసదారులు తన రేంచ్‌లో ఓ గ్రామం నిర్మించుకోడానికి ఇతని కొడుకు అనుమతినిచ్చాడు. ఇది వాల్‌నట్ గ్రోవ్ అనే ఊరికి ఉత్తరంలో మైలు దూరంలో ఉంది. అదంతా చిత్తడి నేల. ఇది కేలిఫోర్నియాలోని శాక్రిమెంటో శాన్ హువాక్విన్ రివర్ డెల్టాలో పధ్నాలుగు ఎకరాల్లో ఉంది. మొత్తం 20-30 ఇళ్ళు వెలిసాయి. ఇక్కడి బోర్డింగ్ గదుల్లో వెయ్యినించి పదిహేనువందలమంది చైనీస్ రూమ్‌మేట్స్‌గా నివశించేవారు. మేము సందర్శించే లాకీ గ్రామం అదే దీనిపేరు లాకీపోర్ట్. దాని చివర్లోని పోర్ట్ అనే పదం 1920లో తొలగించి లాకీగా పిలుస్తున్నారు.



అమెరికాలోని ట్రాన్స్ కాంటినెంటల్ రైలు పట్టాలు వేయడానికి కూలీలుగా వచ్చిన ఆనాటి చైనీస్ ఆ పనయ్యాక ఇక్కడ చిలగడదుంప, బంగాళాదుంప, వైట్ బీన్స్ ఆస్పరాగస్ పొలాల్లో, ఏపిల్, పియర్ తోటల్లో పనిచేసేవారు ఈ ఊళ్ళో దాదాపు ముప్పై ఇళ్ళు వెలిసాయి. ఆదివారాలు అంత కలిసి పందిమాంసాన్ని రోస్ట్ చేసుకునేవారు. అందుకు కమ్యూనిటీ ఓవెన్స్ ఉండేవి. అక్కడి మొదటి భవంతిని చాన్ టిన్ సిన్ కట్టాడు. దాన్ని బీర్ సెలూన్, డ్రై గూడ్స్ షాప్‌గా ఉపయోగించారు. రెండో భవంతిని యు లైసింగ్ నిర్మించాడు. ఇది జూదగృహం. వింగ్ చియాంగ్ నిర్మించిన మూడోది కేంటన్ హోటల్, రెస్ట్రెంట్. ప్రొహిబిషన్ పిరియడ్లో ఇక్కడ మధ్యం అమ్మేవారు. చట్టవ్యతిరేక వినోదానికి గమ్యమై, దీనికి ‘కేలిఫోర్నియా మాంటికార్లో‘ అనే ముద్దుపేరు వచ్చింది. ఇక్కడ జూద గృహాలు ఐదు, వేశ్యాగృహాలు ఐదు (తెల్లవాళ్ళు దీన్ని నడిపేవారు) ఓపియం డెన్స్ ఉండేవి. తమాషాగా లాకీకి చైనీస్ భాషలో హేపీ లివింగ్ అనే అర్థం కూడా ఉంది.

ఆనాటి రెండంతస్థుల చెక్క ఇళ్ళు సరైన పునాది లేకపోవడంతో నేడు అవి పక్కకి వంగాయి. 1971లో దీన్ని రిజిష్టర్ ఆఫ్ హిస్టారిక్ ప్లేసెస్‌లో నమోదు చేసారు. మళ్ళీ 1990లో నేషనల్ హిస్టారిక్ లేండ్ మార్క్ డిస్ట్రిక్ట్‌గా పేర్కొన్నారు.

క్రమంగా చైనీస్ అమెరికన్స్ ఉన్నత విద్యని అభ్యసించి అమెరికా జనజీవన స్రవంతిలో కలిసిపోయారు. నేడు లాకీలో నివశించే తక్కువమంది తెల్లవాళ్ళే.

లాకీ బోర్డింగ్ హౌస్ మ్యూజియాన్ని కేలిఫోర్నియా స్టేట్ పార్క్ నిర్వహిస్తోంది. 2016లో మెయిన్ స్ట్రీట్‌లో లాకీ కంట్రీ స్టోర్ రెండో అంతస్థులో అగ్నిప్రమాదం జరిగి అది, దాని వెనకిల్లు కాలిపోయాయి. వెనకాల ఇళ్ళకి, మెయిన్ రోడ్ ఇళ్ళకి మధ్య కాలిబాట లాంటి చిన్న

సందుంది. చాలా ఇళ్ళు శిథిలావస్థలో ఉన్నాయి. మెయిన్ రోడ్లోని భవంతుల్లో మూన్‌కేఫ్, రివర్ రోడ్ గేలరీలు నడుస్తున్నాయి. అక్కడి స్కూల్‌ని చూసాం. పింగాణీ పాత్రలు, బట్టలు, మెటల్ జువెలరీ, పూసలతో చేసిన వస్తువులు అమ్మే ఏంటిక్స్ షాప్‌లు తెరిచి ఉన్నాయి. సావనీర్ షాప్‌లో కాంతిగారు, పద్మజ చైనీస్ సింబల్స్ ఉన్న గాజులు కొన్నారు. నేను, కిరణ్‌ప్రభగారు కీ చెయిన్స్ కొన్నాం.

హ్యాగన్ గురించి చెప్పకపోతే లాకీ చరిత్ర పూర్తిగా చెప్పినట్లు కాదు.

***హ్యాగన్:*** అక్కడున్న లాకీ ఫౌండేషన్ న్యూస్ లెటర్ ఉచిత కాపీని తీసుకున్నాను. అందులో చైనీస్ వలసదారుల అసోసియేషన్ సమాచారం చదివితే హ్యాగన్ గురించిన ఆసక్తికరమైన సమాచారం తెలిసింది. శాన్‌ఫ్రాన్సిస్కోలో చాలా హ్యాగన్స్, అంటే చైనీస్ అసోసియేషన్స్ ఉండేవి. అక్కడి చైనీస్ అంతా గువాంగ్ డాంగ్ అనే ప్రాంతం నించి వచ్చినవారు. ఒకే మాండలికం, ఒకే జాతి, వర్గం, ఒకే గ్రామం, ఇంటిపేరు, రక్తసంబంధీకులు, లేదా పెళ్ళి ద్వారా బంధువులైన వారు ప్రత్యేకంగా ఇలా అసోసియేషన్‌ని ఏర్పరచుకునేవారు. చైనీస్ వ్యాపారస్థులు ఈ హ్యాగన్‌ని (ఫేమిలీ అసోసియేషన్) నిర్వహించేవారు. గువాంగ్ డాంగ్ నించి వచ్చిన కొత్త వలసదారులు (వీరిని పేపర్ సన్స్ అని పిలిచేవారు) శాన్‌ఫ్రాన్సిస్కోకి వచ్చినప్పుడు హ్యాగన్ సంస్థలు ఈ బాధ్యతలని నిర్వహించేవి.

1. రేవులో కొత్త వలసదారులని రిసీవ్ చేసుకుని, అసోసియేషన్ భవంతికి తెచ్చి, సభ్యులుగా నమోదు చేయడం.
2. నిద్రకి, వంటకి క్వార్టర్స్‌ని ఇవ్వడం.
3. ఉద్యోగ సంపాదనకి సహకరించడం.
4. సభ్యుల మధ్య వివాదాలని పరిష్కరించడం.
5. తమ అసోసియేషన్ సభ్యుల హితవుని చూడటం.
6. ఇంగ్లీష్ భాషలో శిక్షణ, ఉచిత మందులు, బీదలు, వృద్ధులు, మార్గమధ్యంలో జబ్బుపడి పని చేయలేనివారికి తిరిగి చైనా వెళ్ళడానికి ఉచిత టిక్కెట్లు, స్మశాన నిర్వహణ, బీదల కర్మకాండ ఖర్చు ఈ హ్యాగన్ భరించేది.

ఆ రోజుల్లోని కొన్ని హ్యాగన్ ఫేమిలీ అసోసియేషన్స్ పేర్లు గీ హా ఓక్ టిన్, (చాన్, ఛిన్, చున్ ఇంటిపేర్లు గలవాళ్ళు) లమ్ సాయ్ హో టాంగ్ (లమ్, లిమ్ ఇంటిపేర్లు) ఫంగ్ టాయ్ లీ. ఇండియన్స్‌కి, ముఖ్యంగా తెలుగు వారికి అనేక దేశాల్లో ఉన్న వివిధ అసోసియేషన్స్ కూడా ఈ హ్యాగన్స్ పద్ధతుల్నే అనుసరిస్తున్నాయి.




1852లో తమ మీద జరిగే హింసకి వ్యతిరేకంగా, ఆత్మరక్షణ కోసం చైనీస్ హ్యాగన్స్‌ని స్థాపించేవారు. వారిలో బాగా చదువుకున్నవారు, ఐశ్వర్యవంతులు తక్కువగా ఉండేవారు. అలా చందాలు లభించకపోవడంతో సభ్యత్వ రుసుముని హ్యాగన్‌ని నడపడానికి ఉపయోగించేవారు. చాలా సంస్థల్లోలా హ్యాగన్ నిర్వాహకుల్లో కూడా ఐకమత్యం లేక చీలికలొచ్చి, విడిపోయి వేరే సంస్థలని స్థాపించేవారు. ఎక్కువగా ఫండ్స్ మిస్ మేనేజ్‌మెంట్ ఆరోపణలుండేవి.

అమెరికాలోని పెద్ద నగరాలైన శాన్‌ఫ్రాన్సిస్కో, ఓక్‌లేండ్, న్యూయార్క్ సిటీ, హోనాలులూ లాంటి చోట్ల ఇలాంటి అసోసియేషన్స్ ఉండేవి. శాన్‌ఫ్రాన్సిస్కోలో ఈ అసోసియేషన్

భవంతులు లేవర్లీ ప్లేస్, స్టాక్టన్ స్ట్రీట్, గ్రాంట్ అవెన్యూలో ఉండేవి. చైనావాళ్ళు ప్రపంచంలో వలస వెళ్ళిన ప్రతీదేశంలో ఇలాంటి అసోసియేషన్స్ ఉండేవి.

ఆ రోజుల్లో ఓడల్లో టిక్కెట్ కొనేముందు ఎగ్జిట్ పర్మిట్ అవసరమయ్యేది. అమెరికాలో అప్పులేని వారికే ఎగ్జిట్ పర్మిట్ ఇచ్చేవారు. అందుకోసం తమ సభ్యుల అప్పులని ఈ అసోసియేషన్ తీర్చేది.

చివరికి ఈ ఫేమిలీ అసోసియేషన్స్ అన్నీ 'చైనీస్ కన్సాలిడేటెడ్ బెనవలెంట్ అసోసియేషన్' అనే గొడుగు కిందకి చేరాయి. చైనీస్ పట్ల వివక్ష, తెల్లజాతి నించి హింసలాంటివి ఎదుర్కొన్నప్పుడు ఇది కోర్టుల్లో న్యాయం కోరేది. లేదా రాజకీయ పలుకుబడితో సరిదిద్దేది.

ఒన్ డే ఒన్ డాలర్, వాటర్ ఘోస్ట్స్, బిట్టర్ మెలోన్: ఇన్ సైడ్ అమెరికాస్ లాస్ట్ చైనీస్ టౌన్ అనే మూడు పుస్తకాలు లాకీ గ్రామం నేపథ్యంలో వెలువడ్డాయి. వెనక్కి తిరిగి వస్తూ దారిలో ఫ్రోజెన్ యోగర్ట్ తిని ఇంటికి వచ్చాం.

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments

www.anandbooks.com
www.telugubooks.in
***ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి***